

# బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

**విశ్వంభర, హైదరాబాద్ :** బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు హైకోర్టు అనుమతించింది. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న పేట్ బషీరాబాద్ పీఎస్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 15న వాదనలు విన్న హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు ఆయన తరపున న్యాయవాది అనుమతి కోరారు. న్యాయవాది విజ్ఞప్తి మేరకు హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది.

### బ్యాడ్మింటన్ క్రీడాకారులకు

# అన్ని విధాలా అండగా ఉంటాం

### తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త




**విశ్వంభర, నాగోల్ :** బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటాం అని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. గురువారం ఉప్పల్‌లోని గోవర్ధన్ బ్యాడ్మింటన్ అకాడమీలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లలో ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడం ఎంతో ఆనందంగా ఉందని, బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు సంఘం కృషి చేస్తోందని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికి తీయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర మంత్రి , బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి పుల్లెలగోపీచంద్ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. క్రీడా పాలసీ నీ తీసుకొచ్చి గ్రామీణ క్రీడాకారులను వెలికి తీయడానికి ప్రభుత్వం కృషి చేస్తుంధి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త కార్యదర్శి బాబు , రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి ఆనంద్ బాబు , సామా ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిష్టరాంపల్లి రిజర్వాయర్‌లో విషాదం

### హైదరాబాద్ యువకుడు మృతి

**విశ్వంభర, మర్రిగూడ :** కిష్టరాంపల్లి రిజర్వాయర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. డిండి రిజర్వాయర్ ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న కిష్టరాంపల్లి రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సఫాన్ (17)గా గుర్తించారు. అతను హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు సమాచారం. సఫాన్ తండ్రి పాడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులకు వండర్ వరల్డ్‌కు వెళ్తున్నాను అని చెప్పిన సఫాన్, తన స్నేహితులతో కలిసి మర్రిగూడ మండలానికి వచ్చాడు. గురువారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో ముగ్గురు స్నేహితులు కలిసి కిష్టరాంపల్లి రిజర్వాయర్‌లో ఈతకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో సఫాన్ నీటిలో మునిగి కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న చింతపల్లి, మర్రిగూడ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక ఈతగాళ్ల సహాయంతో యువకుడి కోసం గాలింపు చేపట్టగా, అనంతరం మృతదేహాన్ని వెలికి తీసినట్లు తెలిసింది. ఈ ఘటనతో యువకుడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సరదాగా బయటకు వెళ్లిన కుమారుడు మృతదేహంగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. రిజర్వాయర్ల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణంలో ఉన్న జలాశయాల్లో ఈతకు దిగడం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



# ఉద్యమకారులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- డా. కాచం సత్యనారాయణ
- తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి బస్సు యాత్ర
- తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహం శుద్ధి
- ఈ నెల 30న ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు పై చర్చగోష్టి



**విశ్వంభర, హైదరాబాద్ :** మారోజు వీరన్న స్థూపం నుండి గద్దర్ సమాధి వరకు నిర్వహిస్తున్న తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి బస్సు యాత్రలో భాగంగా గురువారం ఉదయం ఎల్ బీ నగర్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి విగ్రహం దగ్గర తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీకాంతచారి పాదాలను తెలంగాణ ఉద్యమకారులు అలాగే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాచం సత్యనారాయణ, ఆశయాల సాధన సమితి కోరే సాయిరాం కడగడం జరిగింది. అనంతరం తెలంగాణ ఉద్యమ నాయకుల విగ్రహలకు జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కవియిత్రి మొల్ల శుద్ధి చేపట్టి పూలదండలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం, వారి గుర్తింపు, గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అన్యాయం చేసారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకొని 12 సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా తెలంగాణ ఉద్యమకారులకు సరైన గుర్తింపు ప్రోత్సాహం దక్కలేదని మాట వాస్తవమని, గత ప్రభుత్వం ఉద్యమకారులకు ఏదో మంచి చేస్తారని ఆశించినప్పటికీ ఉద్యమకారుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపన చేసి ఉద్యమకారులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ద్వారా ప్రభుత్వం చేపట్టిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గడిచిన రెండున్నర సంవత్సరాలలో ఉద్యమకారుల అంశంపై స్పందించకపోవడం, నేడు కేకే కమిటీ ద్వారా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీని వేయడం స్వాగతిస్తూ ఈ ప్రభుత్వమైనా ప్రజాపాలనలో కాలయాపన జరగకుండా వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించినటువంటి అన్ని సంఘాలను కలుపుకొని వారి సూచనలు సలహాలు తీసుకొని నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి సరైన అవకాశాలు ప్రాధాన్యత 250 గజాల స్థలము సరైన గుర్తింపు కల్పించాలని కోరారు. అలాగే ఈనెల 30వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు చర్చా గోష్టి కార్యక్రమం తెలంగాణ ఉద్యమ గల సంక్షేమ సంఘం డాక్టర్ కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి పెద్ద ఎత్తున ఉద్యమకారులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులు, అమరులు, కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అమరుల అశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం డిమాండ్ చేశారు. ఈసంధర్భంగా సాయిరాం మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక పోతే అందోళన చేస్తామని హెచ్చరించారు. ఉద్యమకా రులు సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బీరెల్లి వెంకటరెడ్డి, పల్లె వినయ్ కుమార్, రామ్ కోటి, తెలంగాణ అడబిడ్డల వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు వెలుగు వనిత, రాష్ట్ర కోషాధికారి మాలోజు శ్రీనివాసచారి, పల్లే లింగన్న, సాంస్కృతిక సారధి బుల్లేట్ వెంకన్న, సలహాదారు, లింగయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వరికుప్పల కాలాస్త్రి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బట్టు లింగం తదితరులు పాల్గొన్నారు.

### న్యూజెర్సీలో హరీశ్‌రావు..

# మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎన్నారైలతో చర్చ




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ప్రాంతీయ పార్టీలే కేంద్రంలో చక్రం తిప్పుతున్నాయని.. ప్రాంతీయ పార్టీలే దేశ రాజకీయాల్లో కీలకమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. గురువారం అమెరికా న్యూజెర్సీలోని హల్దీ మౌంట్ లారెల్‌లో మీట్ అండ్ గ్రీట్ విత్ హరీశ్‌రావు కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావుకు బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్, ఎన్నారైలు మహేశ్ తన్నీరు, నరసింహారావు, భాస్కర్ పిన్న, రవీందర్ రావు ఘనస్వాగతం పలికారు. మీట్ అండ్ గ్రీట్‌లో తెలంగాణ సమకాలీన అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లోనూ ప్రాంతీయ పార్టీల పాత్ర రోజురోజుకూ పెరుగుతున్నదని, కేంద్రంలో కూడా ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. రాష్ట్రం పంజాబ్‌ను మించి ధాన్యం ఉత్పత్తి చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, సంక్షేమం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధించిందని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విజన్ లేని పాలన కారణంగా రాష్ట్రంలో అనిశ్చితి నెలకొందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు మాత్రమే కాకుండా, కనీసం ఒక ఫ్లాట్ కొనుగోలు చేయాలన్నా ఎన్నారైలు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో స్థిరత్వం, అభివృద్ధిపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందన్నారు. తెలంగాణ సమకాలీన రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర భవిష్యత్ అంశాలపై ఎన్నారైలు ఆసక్తిగా చర్చించినట్లు హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాస తెలంగాణ వాసుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్‌తో పాటు ఎన్నారైలు మహేష్ తన్నీరు, నరసింహా రావు, భాస్కర్ పిన్న, రవీందర్ రావు, అమర్ గుండ, పరమేశ్ బీం రెడ్డి, చైతన్య చిట్టిమల్ల, వరప్రసాద్, చందు తాళ్ల, పూర్ణ బైరి, నరసింహారెడ్డి, దొంతి రెడ్డి, రజినీ తదితరులు పాల్గొన్నారు.



# మద్దతివ్వండి: శివరాజ్‌సింగ్ చౌహాన్ కోరిన మంత్రి తుమ్మల

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ, ఉద్యాన రంగ ప్రోత్సాహం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని, కొన్ని అంశాల్లో కేంద్ర ప్రభుత్వ మద్దతు అవసరమని వివరించారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్ ఐఐఎంఆర్‌లో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి రైతులు సమస్యలను వివరించారు. రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో మొక్కజొన్న, జొన్న పంటల సాగు సుమారు 20.29 లక్షల ఎకరాల్లో జరిగిందని, దాదాపు 47.23 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ మొక్కజొన్న ధర సుమారు రూ.1,800 వరకే ఉండగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,400గా ఉన్నదని దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 336 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 11.45 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసిందన్నారు. మొక్కజొన్న, జొన్న పంటలను ధర మద్దతు పథకం పరిధిలో చేర్చి, కేంద్ర నోడల్ ఏజెన్సీల ద్వారా సుమారు 14.90 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న, 2.01 లక్షల మెట్రిక్ టన్నుల జొన్న కొనుగోళ్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే నిల్వ సదుపాయాలు, రవాణా, లాజిస్టిక్స్ వంటి అంశాలకు తగిన మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. సీజన్‌లో పొద్దుతిరుగుడు సాగు కూడా గణనీయంగా పెరిగిందని, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 3,690 మెట్రిక్ టన్నుల కొనుగోలుకే అనుమతి ఇవ్వడం రైతుల అవసరాలకు సరిపోదం లేదని పేర్కొన్నారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,721గా ఉన్నప్పటికీ మార్కెట్‌లో రైతులకు చాలా తక్కువ ధరలు లభిస్తున్నాయని వివరించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా మార్కెట్ యార్డుల్లో, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉన్న పంట తడిసిపోతోందని తెలిపారు. కొనుగోలు పరిమితిని వెంటనే పెంచకపోతే చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారని ప్రస్తుతం ఉన్న 3,690 మెట్రిక్ టన్నుల కొనుగోలు పరిమితిని 15,262 మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం సూక్ష్మ సాగునీటి పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, పండ్ల తోటలు, కూరగాయల సాగు, ఆయిల్ పామ్ వంటి పంటల ప్రోత్సాహానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఆయిల్ పామ్ అమలులో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో ఉందని, రాష్ట్రంలో 1.16 లక్షల హెక్టార్లలో 79,448 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. 202627 సంవత్సరానికి మరో 34 వేల హెక్టార్ల విస్తరణ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా హెర్బిసైడ్ టోలరెంట్ కాటన్ విత్తనాల వినియోగం పెరుగుతుందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన జాతీయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, కూలీల కొరత, పెరుగుతున్న సాగు వ్యయాలు, కలుపు నివారణ ఖర్చుల కారణంగా రైతులు హెటీ కాటన్ వైపు మొగ్గు చూపుతున్నారని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ఘనంగా సరస్వతీ నది అంత్య పుష్కరాలు ప్రారంభం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు.

### పుష్కర విశిష్టత..

ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

# బీఆర్ఎస్ కంటే రెండింతలు ధాన్యం కొనుగోలు చేశాం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కేటీఆర్ మీరు అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఏనాడైనా గుర్తుకొచ్చారా? సూటు బూటు వేసుకొని కార్పొరేట్లతో చట్టాపట్టాలు వేసుకొని, ఫైవ్ స్టార్ హోటళ్లలో జల్సాలు చేస్తూ తిరిగేవారు అంటూ ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు కేటీఆర్ కు గురువారం బహిరంగ లేఖ రాశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా రైతు సమస్యల గురించి మీరు మాట్లాడారా? చర్చించారా? సమీక్ష చేశారా? అధికారం దూరమవడంతో మీకు సాధారణ ప్రజలు గుర్తుకొస్తున్నారని అని, అధికారంలో ఉన్నప్పుడు మీ జీవితం మొత్తం కార్పొరేట్ స్టైల్‌లో నడిచిందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్లు, మక్కలను శరవేగంగా కొనుగోలు చేస్తోందని, కలెక్టర్లు ప్రతిరోజూ ధాన్యం కొనుగోళ్లపై పర్యవేక్షణ చేస్తున్నారన్నారన్నారు. మే 20, 2026 నాటికి రాష్ట్రంలో 45.02 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని, ఈ ఏడాది రబీ ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని చింతకుంట విజయరమణా రావు చెప్పారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు రూ.7,508 కోట్లు చెల్లింపులు జరిగాయని, 6.3 లక్షల మంది రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేసి డబ్బులు జమ చేశామన్నారు. 12 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్లు, 33 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేశామని, 13,100 వాహనాలను ధాన్యం రవాణాకు ఉపయోగిస్తున్నామని, 202122లో 6,609 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే, మా ప్రభుత్వం ఇప్పుడు 8,575 కేంద్రాలు ఏర్పాటు చేసిందని విజయరమణా రావు చెప్పారు. 202122 రబీలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 21.79 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే, తాము 45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం 15 రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారని, ప్రతి రోజూ సగటున 50,000 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేస్తున్నామని విజయరమణారావు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని, వాహనాలు, హమాలీలు, గన్నీ బ్యాగులు, గోదాములలో నిల్వ స్థలం ఉండేలా చూస్తున్నామని, వాహనాలు, లాజిస్టిక్స్ అందించడంలో విఫలమయ్యే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన వివరించారు. 336 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 11,54,469 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేశామని, ఇప్పటికే గోదాములకు 9,53,050 మెట్రిక్ టన్నుల మక్కలను తరలించిచామని, 2,42,43,992 గన్న బ్యాగులను సరఫరా చేశామని విజయరమణారావు చెప్పారు. మీ ప్రభుత్వ హయాంలో మక్కలు కొనుగోలు చేయకుండా ఎగనామం పెడితే రైతులు తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారని, రోజుల తరబడి వేచి ఉండి ధాన్యం కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆయన విమర్శలు గుప్పించారు. ఇప్పటికైనా కేటీఆర్ శవ రాజకీయాలు చేయటం మానుకోవాలని, మీ హయాంలో ధాన్యం కొనుగోలు ఎంత చేశారు? ఇప్పుడు ఎంత ధాన్యం కొనుగోలు చేస్తున్నారో తెలుసుకోవాలని విజయరమణారావు హితవు పలికారు.


# రిపోర్టర్లు కావలెను

V3 NEWS | ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108